క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

తగరపువలస: ఆనందపురం మండలం 11 కేవీ బాకూరుపాలెం ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. బాకూరుపాలెం, ఇచ్చాపురం, చిన్నయ్యపాలెం, రామునాయునిపేట, రేగానిగూడెం, ముకుందపురం కాలనీల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

చిన్నాపురం పాఠశాల ఉపాధ్యాయుల బదిలీ తగదు



ఉపాధ్యాయులను బదిలీ చేయొద్దని కోరుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పద్మనాభం: మండలంలోని చిన్నాపురం ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను బదిలీ చేయొద్దని విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవో పి.రమణ, ఉపాధ్యాయ సంఘ నాయకులకు సోమవారం విన్నవించారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో విద్యార్థుల తల్లి దండ్రులు వీరిని కలిశారు. ఉపాధ్యాయులు ఆర్.సునీత, ఎ.ఆదిబాబు అంకితభావంతో పని చేస్తూ విద్యార్థుల ప్రగతికి, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని వీరు ఎంఈవో, ఉపాధ్యాయ సంఘ నాయకులకు విన్నవించారు. ప్రస్తుత బదిలీల్లో వీరిని బదిలీ చేయకుండా ఇదే పాఠశాలలో కొనసాగించాలని కోరారు. కె.అప్పల సూర్యనారాయణతో పాటు పలువురు విద్యార్థుల తల్లిదుండ్రులు విన్నవించుకున్న వారిలో ఉన్నారు.

ఉద్యోగులకు యోగాలో శిక్షణ



యోగా నేర్చుకుంటున్న ఉద్యోగులు

పద్మనాభం: యోగాంధ్రలో భాగంగా మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉద్యోగులకు యోగా శిక్షణ ఇచ్చారు. సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు వీవోఏలు, ఉపాధి హామీ పథకం వీఆర్వోలకు ఈ శిక్షణ ఇచ్చారు. రేవిడి ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారిణి సౌజన్య, కృష్ణాపురం సచివాలయ డిజిటల్ అసిస్టెంటు భార్గవ ఈ శిక్షణ ఇచ్చారు. జూన్ 21న ఆర్‌కేబీచ్ వద్ద జరగనున్న యోగాకు ఆరు వేల మందిని తరలించనున్నట్టు ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో యోగాంధ్రపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 140 బస్సుల్లో వీరిని తరలించనున్నట్టు తెలిపారు.

ఆదర్శవంతంగా వైశాఖి స్పోర్ట్స్ పార్క్



మాట్లాడుతున్న సనపల వరప్రసాద్

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పార్కు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ అన్నారు. వేములపల్లి కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన పార్క్ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వాకర్స్, సందర్శకుల అభిరుచిని తెలుసుకుని, వారికి కావాల్సిన సౌకర్యాలు అందుబాటులోకి తేవడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు సహకారంతో నగరంలోనే అత్యుత్తమ పార్కుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక తయారు చేశామని తెలిపారు. పార్కు కార్యదర్శి పి.వి.సూర్యనారాయణ రాజు ఏడాది కాలంలో నిర్వహించిన అభివృద్ధి, సాంస్కృతిక, సేవా కార్యక్రమాల నివేదికను వివరించారు. కోశాధికారి మళ్ల రామకృష్ణ పార్క్ ఆదాయం, వ్యయం వివరాలు తెలిపారు. పార్క్ న్యాయ సలహాదారు జనపరెడ్డి పృథ్వీరాజ్, పూర్వ అధ్యక్షుడు అంబికా ప్రసాద్, ఎన్నికల సలహా మండలి సభ్యుడు రొంగలి జగన్నాథం, సంకు వెంకటేశ్వరరావు అభివృద్ధి పనులను ప్రశంసించారు. ఉపాధ్యక్షులు పల్లా చంద్రమౌళి, శీతిన సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులు రఘురామ పండ, పి.కంకరాజు, సంయుక్త కోశాధికారి కె.కె.సురేష్, కార్యవర్గ సభ్యులు ఎం.వి.రెడ్డి, టి.ఎస్.ఎన్.రాజు పాల్గొన్నారు.

ప్రయాణికుల అవస్థలు పట్టవా?



షెల్టర్‌కు నోచుకోని పీఎం పాలెం ఆఖరి బస్టాపు

- పీఎంపాలెం బస్టాప్‌లో షెల్టర్ కరువు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



చాలీచాలని పీఎం పాలెం మూడో బస్టాప్ షెల్టర్

పీఎం పాలెం: పీఎం పాలెంలోని ఆఖరి బస్టాపులో సరైన బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 30 వేల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. విద్యార్థులు కూడా వందల సంఖ్యలో ఉన్నారు. గతంలో ఉన్న నాలుగు బస్ షెల్టర్లను 10 సంవత్సరాల క్రితం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తొలగించారు. అప్పటి నుంచి వాటిని తిరిగి నిర్మించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎండ, వానల నుంచి రక్షణ లేక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బస్సులు ఎక్కేందుకు వేచి చూసే వారికి నిలబడటానికి కూడా చోటు లేదు. ఇప్పటికే ఉన్న సిమెంట్ బెంచ్‌లు ఎండకు వేడిగా, వర్షానికి తడిగా ఉండి నిరుపయోగంగా మారాయి. అధికారులు ఈ సమస్యపై తక్షణమే స్పందించి తగిన వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రస్తుత ఆఖరి బస్టాపు దుస్థితి

వందలాది మంది ప్రయాణికులు పీఎం పాలెం ఆఖరి బస్టాపులో బస్సులు ఎక్కుతుంటారు. ఇక్కడ బస్సు సర్వీసులు కూడా అధికంగానే ఉన్నాయి. అయితే బస్సుల రాకపోకలకు సంబంధించిన సమయ వివరాలను తెలిపే బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం పట్ల ప్రయాణికులు సంబంధిత శాఖ అధికారులను తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇక్కడ బస్సులు ఎక్కడానికి వచ్చే ప్రయాణికులకు ఎండ, వానల నుంచి తల దాచుకోవడానికి ఎటువంటి రక్షణ లేదు. తాము ఎక్కవలసిన బస్సు వచ్చే వరకు నిలబడవలసిందే తప్ప మరో మార్గం లేదు. అక్కడ ఉన్న సిమెంట్ బెంచీలు ఎండకు వేడిగా, వర్షానికి తడిసి ఉంటాయి. అవి ఉన్నా లేనట్లే. ఎండా కాలం కంటే వర్షా కాలంలో మరీ ఇబ్బంది. వర్షపు చినుకులకు ప్రయాణికుల దుస్తులు తడిచిపోయినా ఆ దుస్తులతోనే ప్రయాణించవలసిన పరిస్థితి. ఇతర బస్టాపులలో, రెండవ బస్టాపు పరిస్థితి కూడా ఇలాగే ఉంది. మూడు, నాలుగు బస్టాపులలో చిన్నపాటి, చాలీచాలని షెల్టర్లు నిర్మించారు. అవి కూడా సరిపోవడం లేదు. పెద్ద వర్షం పడితే ప్రయాణికులు ఇబ్బంది పడవలసిందే.

చాలా ఇబ్బందిగా ఉంది



పీఎం పాలెం బస్టాపులో బస్ షెల్టర్ లేకపోవడం వల్ల ప్రయాణికులం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. బస్సులు వచ్చే వరకు నిలబడాల్సి వస్తోంది. ఇది చాలా అసౌకర్యంగా ఉంది. ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లలు మరింత ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సౌకర్యవంతమైన బస్ షెల్టర్‌ను నిర్మించాలి.

డి.మోహనరావు, పీఎం పాలెం

వృద్ధుల అవస్థలు



పీఎం పాలెం బస్టాపులో సరైన బస్ షెల్టర్ లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నాం. వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు బస్టాపునకు వచ్చే వృద్ధులకు ఎండ, వానల నుంచి రక్షణ లేదని, వారిలో అధిక శాతం మంది కాళ్ల నొప్పులతో బాధపడుతున్నందున ఎక్కువ సమయం నిలబడలేకపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి బస్ షెల్టర్లను నిర్మించడానికి చర్యలు చేపట్టాలి

పి.ప్రసాద్, పీఎం పాలెం

సౌకర్యాలు కల్పించాలి



బస్టాపులో సరైన సౌకర్యం లేకపోవడం వల్ల మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని వివిధ సంస్థలలో పనిచేస్తున్న మహిళలు ఇక్కడి నుంచి బస్సులు ఎక్కుతుంటారు. వర్షాలకు దుస్తులు తడిసి కొన్నిసార్లు ప్రయాణాన్నే రద్దు చేసుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. వెంటనే ఆఖరి బస్టాపు వద్ద ప్రయాణికులకు అన్ని సదుపాయాలు కల్పించాలి.

పి.లీల, పీఎం పాలెం.

అధికారులు స్పందించాలి



బస్టాపులో కనీస సౌకర్యాలు లేకపోవడం వల్ల విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో షెల్టర్ లేకపోవడంతో వర్షంలో తడిసి కాలేజీలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా కనీసం చిన్నపాటి బస్ షెల్టర్ అయినా నిర్మించాలి. లేకపోతే వర్షాకాలంలో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అధికారులు స్పందించాలి.

మోహిత్, విద్యార్థి

విలువైన ప్రభుత్వ భూమి స్వాధీనం



గిడిజాల పంచాయతీ సర్వే నంబర్ 258లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాల పంచాయతీ దిబ్బడిపాలెం గ్రామంలోని సర్వే నంబర్ 258లో పెద్ద కొండను ఆనుకుని సుమారు 2 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. దీని విలువ రూ.25 కోట్లు ఉంటుందని అంచనా. ఈ ప్రాంతాన్ని పరిశీలిస్తే వేలాది లారీలతో గ్రావెల్‌ను అక్రమంగా తరలించినట్టు తెలుస్తోంది. బయటికి మాత్రం ఆట స్థలం కోసం స్థానిక యువకులు ఈ విశాలమైన ప్రభుత్వ స్థలాన్ని చదును చేసినట్టు చెబుతున్నారు. ఇప్పటికే దిబ్బడిపాలెంలో రూ.40 కోట్ల విలువైన నాలుగు ఎకరాల గెడ్డ వాగులను కబ్జా చేసిన ఘనుడే ఈ స్థలంలో గ్రావెల్ తరలించి ఆక్రమణకు ప్రయత్నించినట్టు ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. దీనిపై వీఆర్వో నవీన్‌ను వివరణ కోరగా ఈ స్థలం పీహెచ్‌సీ నిర్మాణం కోసం కేటాయించబడిందన్నారు. దీనిని శనివారమే స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఉత్సాహంగా కథల పోటీలు



రాసిన కథలను చూపుతున్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ వై.పద్మజ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు వారికి నచ్చిన కథల రచనలో పోటీలు నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులకు బిస్కెట్లు అందించారు.

టెండరు నిబంధనలకు అధికారుల తూట్లు



రేఖవానిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం గ్రామ పంచాయతీలో టెండరు నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీ విస్తరణ అధికారి కె.రమేష్‌నాయుడు, కార్యదర్శి ఆదిరెడ్డి గాయిత్రి వ్యవహరించారని టెండరుదారులు ఆరోపించారు. పంచాయతీలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఏడాది పాటు పారిశుధ్య పనులు, వీధిదీపాలు, తాగునీటి సరఫరా పథకం, కార్యాలయ స్వీపర్ కమ్ అటెండర్, ప్లంబర్ పనుల నిర్వహణకు గాను 15 మందిని నియమించుకోవడానికి టెండర్లు పిలిచారు. దీని కోసం సోమవారం పంచాయతీ కార్యాలయంలో సీలు వేసిన టెండర్లు స్వీకరించారు. గ్రామ పంచాయతీకి చెందిన గంధవరపు ఇందిర, గంధవరపు ఉష, గొంప చంద్రశేఖర్, గంధవరపు హరీష్, రుత్తల తేజశ్రీ, గుడివాడ రమణమ్మ పేరుతో ఆరుగురు టెండర్లు దాఖలు చేశారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో టెండరుదారుల సమక్షంలో వీటిని తెరవనున్నట్టు షరతులతో కూడిన నోటిఫికేషన్ అధికారులు జారీ చేశారు. తీరా టెండర్లు తెరిచిన సమయంలో మొదటి అయిదుగురు హాజరుకాగా గుడివాడ రమణమ్మకు బదులు ఆమె కుమారుడు హాజరయ్యాడు. టెండర్ కొటేషన్లలో రమణమ్మ దాఖలు చేసిన మొత్తం అందరి కంటే తక్కువగా రూ.4,30,800 ఉండటంతో ఆమెకే పంచాయతీ కాంట్రాక్ట్ పనులు అప్పగించనున్నట్టు కార్యదర్శి ప్రకటించారు. దీనికి మిగిలిన అయిదుగురు అభ్యంతరం వ్యక్తం చేశారు. నోటిఫికేషన్‌లో నిబంధనల ప్రకారం టెండరుదారుల సమక్షంలోనే వీటిని తెరవవలసి ఉందన్నారు. కానీ రమణమ్మకు బదులు ఆమె కుమారుడు పాల్గొని ఆయనే ధరావత్తు సొమ్ము చెల్లించి, రిజిస్టర్‌లో సంతకం చేసినందున ఇది చెల్లదని తర్వాత తక్కువ సొమ్ముకు టెండర్ దాఖలు చేసిన వ్యక్తికి కాంట్రాక్ట్ పనులు అప్పగించాలని అయిదుగురు డిమాండ్ చేశారు. కానీ కూటమి నాయకుల ఒత్తిడికి లోనైన పంచాయతీ విస్తరణ అధికారి, కార్యదర్శి రమణమ్మకే కాంట్రాక్ట్ పనులు అప్పగిస్తామని లేదంటే టెండర్లు రద్దు చేస్తామని ప్రకటించారని ఆరోపించారు. కూటమి నాయకులతో కుమ్మక్కై, రమణమ్మ తక్కువ మొత్తానికి టెండర్ వేయడంలో ఈ ఇద్దరు అధికారుల ప్రమేయం ఉందని వీరిపై విచారణ జరిపించాలని మిగిలిన టెండరుదారులు ఆందోళన వ్యక్తం చేశారు.

జోన్-2 పీజీఆర్ఎస్‌కి 16 అర్జీలు



జెడ్సీ కనకమహాలక్ష్మికి అర్జీ అందజేస్తున్న పిళ్లా సూరిబాబు

మధురవాడ: పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని జోనల్ కమిషనర్ కొట్యాడ కనకమహాలక్ష్మి చెప్పారు. సోమవారం మధురవాడ జోన్-2 కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జోన్ పరిధిలోని 9 వార్డుల పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి 16 అర్జీలు వచ్చాయి. ఇందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి-4, ఈఈ వర్క్స్-6, వాటర్ సప్లై-1, రెవెన్యూ-3, పబ్లిక్ హెల్త్-1, ఎలక్ట్రికల్-1 చొప్పున అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కనక మహాలక్ష్మి మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 5వ వార్డు బొట్టవానిపాలెంలో పాఠశాలని ఆనుకుని శిథిల స్థితిలో ఉన్న కమ్యూనిటీ హాలును తొలగించాలని వి. రమణ, జీవీఎంసీ 8వ వార్డు వివేకానంద నగర్‌లో డ్రైనేజీ ఆక్రమణను అడ్డుకోవాలని పి. సాయికిరణ్, జీవీఎంసీ 8వ వార్డు బింద్రానగర్‌లో కల్వర్టు నిర్మాణం చేయాలని కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈటీ శేషగిరి, 7వ వార్డు పిలకవానిపాలెం విజయం స్కూలు వద్ద 2024లో ఆమోదించబడిన రోడ్డు పనులు ఇంత వరకు ప్రారంభించలేదని పి. రాజ్‌గోపాల్ ఇలా పలు సమస్యలపై అర్జీలు అందాయి. ఇందులో పలువురు అధికారులు పాల్గొన్నారు.

రోడ్లపై నిలిచిపోయిన వర్షపు నీరు



వీఎంఆర్‌డీఏ పార్క్ వద్ద వర్షపు నీరు



కిర్లంపూడి లే అవుట్‌లో నిలిచిన వాన నీరు

ఏయూక్యాంపస్: సోమవారం ఉదయం కురిసిన వర్షానికి బీచ్ రోడ్డులోని వీఎంఆర్‌డీఏ స్మార్ట్ సిటీ పార్క్ ఎదురుగా రోడ్డుపైన, కిర్లంపూడి లే అవుట్‌లోని పలు రహదారులపైన నీరు నిలిచిపోయి కనిపించింది. దీనిని తొలగించని పక్షంలో దోమలు వృద్ధి చెందే అవకాశముంది. పారిశుధ్య సిబ్బంది స్పందించి రోడ్లపై నిలిచిపోయిన వర్షపు నీటిని తొలగించే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

టైప్ రైటింగ్ పరీక్షలు ఆగస్టులోనే నిర్వహించాలి

తగరపువలస: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ప్రతి ఆరు నెలలకు నిర్వహించే టైప్ రైటింగ్ పరీక్షలను ఏటా మాదిరిగా ఆగస్టులోనే నిర్వహించాలని రాష్ట్ర టైప్‌రైటింగ్ అండ్ షార్ట్ హ్యాండ్ ఇనిస్టిట్యూట్ అసోసియేషన్ సభ్యుడు బల్లా వెంకటరావు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ జూలైలో పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఈ ఏడాది మార్చిలో పాస్ అయిన విద్యార్థుల జాబితాలు ఇంకా సంస్థలకు చేరలేదన్నారు. తక్కువ వ్యవధి కారణంగా విద్యార్థుల సంఖ్య ఆశించినంతగా లేదన్నారు. గతంలో మాదిరే ఈసారి కూడా ఆగస్టులోనే టైప్ రైటింగ్ పరీక్షలు నిర్వహించాలని కోరారు.

సర్వీస్ రోడ్డుపై ఇసుక లారీ బోల్తా

తగరపువలస: ఆనందపురం మండలం పెద్దిపాలెం సర్వీస్ రోడ్డుపై విశాఖ వైపు వెళ్తున్న ఇసుక లారీ సోమవారం సాయంత్రం చీకటి పడిన తర్వాత బోల్తా పడింది. లారీ టైర్ పంక్చర్ కావడంతోనే ఈ ప్రమాదం జరిగినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి నష్టం జరగలేదు. ఆనందపురం ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లారీని, ఇసుకను తొలగించి రహదారిపై వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

హైవేపై విరిగిన చెట్ల కొమ్మలు



చెట్టు కొమ్మలను తొలగిస్తున్న శానిటరీ సిబ్బంది

ఆరిలోవ: జాతీయ రహదారిపై హనుమంతవాక, వెంకోజీపాలెం మధ్యలో సోమవారం వేకువజామున కురిసిన గాలి, వర్షానికి పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపోయాయి. ఇవి రహదారిపై పడటంతో వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారాయి. స్థానికులు జీవీఎంసీ జోన్-2 అధికారులకు సమాచారమివ్వడంతో వెంటనే స్పందించారు. 9వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది, సచివాలయ సిబ్బంది చెట్ల కొమ్మలను తొలగించి వాహన రాకపోకలకు ఆటంకం లేకుండా శుభ్రం చేశారు.

రంజింపజేసిన సినీ సంగీత విభావరి



సినీ గీతం పాడుతున్న గాయకుడు

సీతంపేట: ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాల్లో భాగంగా స్వరాంజలి, స్వరార్చన కళా సంస్థల ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. సంస్థ గాయనీ గాయకులు అంబిక, కల్యాణి, రంజిత, సుజాత, ఎం.కృష్ణంరాజు, భూమతిరావు, నరసింగరావు తదితరులు ఎన్టీఆర్ నటించిన చిత్రాల్లోని పాటలు పాడి ప్రేక్షకులను రంజింపజేశారు.

భద్రతలో భేష్.. ఆర్టీసీ సిబ్బంది

డాబాగార్డెన్స్: ఆర్టీసీలో ప్రయాణించండి.. సురక్షితంగా గమ్యాన్ని చేరుకోండి. మీ భద్రత మాదేనన్న ఆర్టీసీ కొటేషన్లకు సిబ్బంది ప్రయాణికుల భద్రత విషయంలో జాగ్రత్తగానే ఉన్నారనడానికి సోమవారం ద్వారకా బస్ స్టేషన్ వద్ద జరిగిన సంఘటనే నిదర్శనం. తూర్పుగోదావరి జిల్లా నారాయణపురం, పెద్దాపురానికి చెందిన ఆర్.శ్రీనివాసరావు అనే ప్రయాణికుడితో పాటు మరో ముగ్గురు పెద్దలు, ముగ్గురు పిల్లలు విశాఖ నుంచి శ్రీకాకుళం వెళ్లేందుకు ద్వారకా బస్ స్టేషన్‌కు సుమారు ఒంటి గంట ప్రాంతంలో చేరుకుని ఏపీ31జెడ్0381 నంబరు గల బస్సు ఎక్కారు. మధురవాడ వద్దకు వెళ్లే సరికి బ్యాగ్ మిస్సయిందని గుర్తించారు. ఈ విషయాన్ని ఆ బస్సు డ్రైవర్ దృష్టికి తీసుకెళ్లారు. డ్రైవర్ దార్వకా బస్ స్టేషన్ మేనేజర్‌కు ఫోన్ చేశారు. స్టేషన్ మేనేజర్ వెంటనే సెక్యూరిటీ సిబ్బందిని పిలిచి ప్రయాణికుడి బ్యాగ్ మిస్సయిందన్న విషయం చెప్పగా.. సెక్యూరిటీ సిబ్బంది వెంటనే బ్యాగ్ ఆచూకీ కనుగొన్నారు. ప్లాట్‌ఫాం నంబరు 2 వద్ద బ్యాగ్‌ను గుర్తించి భద్రపరిచారు. బ్యాగ్ మిస్సయిన ప్రయాణికుడికి ఫోన్ చేసి బ్యాగ్ ఏ రంగులో ఉంది? బ్యాగులో ఏ సమాన్లు ఉన్నాయి? వంటి వివరాలు అడిగి సెక్యూరిటీ హెడ్ గార్డ్ నారాయణ సమక్షంలో ఆ బ్యాగ్‌ను స్టేషన్ మేనేజర్ జీవీ రమేష్ ప్రయాణికుడికి అందజేశారు.

మల్లె ధరలు తగ్గుముఖం



బంటుపల్లి కళ్లాల్లో మల్లె తోటకు పురుగుల మందు కొడుతున్న రైతు



రైతులు తోటల నుంచి సేకరించిన మల్లెలు

తగరపువలస: భీమిలి నియోజకవర్గంలో మల్లె ధరలు అమాంతం పడిపోయాయి. ప్రస్తుతం పెళ్లిళ్లు తగ్గిపోవడం, గృహ ప్రవేశాలకు ముహూర్తాలు లేకపోవడంతో వీటి ధరలు సగానికి పడిపోయాయి. 10 రోజుల క్రితం కిలో మల్లెలు రూ.700 వరకు అమ్ముడుపోగా ప్రస్తుతం రైతుల వద్ద రూ.300 నుంచి రూ.350 వరకు ధరలు పలుకుతున్నాయి. జూన్ 8 తర్వాత పెళ్లి ముహూర్తాలు లేకపోవడంతో పూర్తిగా మల్లెలకు అన్‌సీజన్ వస్తోంది. దీంతో వీటి ధరలు మరింతగా క్షీణిస్తాయి. ఇటీవల వర్షాలకు దిగుబడి తగ్గిపోవడంతో పాటు మల్లె తోటలను ఆశించిన తెల్లదోమ, నలుపు, ఆరెంజ్ పురుగు, నల్లి పురుగు ఉధృతి తగ్గిపోయింది. అయినప్పటికీ మార్కెట్‌లో ఆశించిన ధర రావడం లేదని రైతులు వాపోతున్నారు. పురుగు మందుల ఖర్చులు, మల్లెలు ఏరడానికి కూలీల ఖర్చులు రావడం లేదని అంటున్నారు. సెంటు విస్తీర్ణంలో కిలో వంతున మల్లెల దిగుబడి వస్తున్నా ఎండ, ఉక్కపోత లేని కారణంగా వీటి సైజు కూడా తక్కువగా ఉంటుంది. ఆగస్టులో శ్రావణ మాసం ప్రారంభం అవుతుంది. ఆ సమయంలో మల్లెలు కిలో ధర రూ.2 వేలకు చేరుకుంటుందని, అప్పటికి వీటి దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని అంటున్నారు. ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా మజ్జివలస, తాటితూరు, వెల్లంకి, పెద్దిపాలెం, బంటుపల్లి కళ్లాలు, గిడిజాల, ఆనందపురం, వేములవలస, లొడగలవానిపాలెం, శింగనబంధ పంచాయతీలలో సుమారు 50 ఎకరాల్లో మల్లె సాగు జరుగుతోంది.

పేదల ఇంటి హామీ నిలబెట్టుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మరుపిళ్ల పైడిరాజు తదితరులు

మధురవాడ: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పట్టణాల్లో అర్హులైన పేదలకు 2 సెంట్ల స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రు. 5 లక్షల నిధులు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. సోమవారం మధురవాడ మల్లయ్యపాలెంలో గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 2వ తేదీన విశాఖ రూరల్ మండల కార్యాలయం వద్ద తమ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టనున్నట్టు చెప్పారు. దీనికోసం ఈ పోస్టర్ ముద్రించినట్టు తెలిపారు. ఇందులో అన్ని వర్గాల ప్రజలు, పేదలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొల్లి రాములమ్మ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోర్టు ఎస్సీ, ఎస్టీ సంఘం నూతన కార్యవర్గం కొలువు

డాబాగార్డెన్స్: విశాఖపట్నం పోర్టు అథారిటీ ఎస్సీ, ఎస్టీ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా దేవీశ్వరరావు మరోసారి ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఎం.సాల్మన్‌రాజు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ టీఎస్ దీప్తి, కె.వేణుగోపాల్, ఈ.వెంకట్రావు, పి.ప్రసన్నకుమార్‌ను, సంయుక్త కార్యదర్శులుగా పి.సుందరేషన్, కె.శ్రీను, సిద్ధార్థకుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎం.ఎస్.రావు, బూరి శ్రీను, సంజీవరావు, కె.వి.రమణతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సీనియర్ సభ్యుడు ఎం.ఎస్.ఎస్.ఎస్. సింగ్ ఆధ్వర్యంలో పోర్టు అసోసియేషన్ కార్యాలయంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో పనిచేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.